# సింహాస్వప్నం

పాపారావు ఆ వూరికి కొత్తగా బదిలీ మీద వచ్చిన చీఫ్ ఇంజనీరు.

మనిషి పసిమిరంగు ఛాయలో సన్నగా, పొడుగ్గా వుంటాడు. కోర మీసాలు అతని మొహానికి అందాన్నివ్వలేదుగానీ అహంకారపు ఛాయల్ని పులిమాయి. అతని మొహంలో చిరునవ్వు చూసిన వ్యక్తులు చాలా అరుదు.

పాపారావుని చూడగానే అతను అహంకారానికి ప్రతిరూపమేమోననిపిస్తుంది. 'అహం' ఎందుకుండదూ? ఆ డిపార్టుమెంటుకి అతనే సర్వాధికారి. అధికారంతోపాటు, ఆర్థిక పరమైన లావాదేవీలన్నీ అతని చేతులమీదుగానే జరగాలి. రెండు చేతులా ఆర్జించాడని ప్రతీతి. ఈ మధ్యనే శ్రీకాకుళంలో రాజభవనం లాంటి ఓ భవంతి కట్టించాడని వినికిడి. అక్కడైతే తాను ఆ భవంతి కట్టించినట్టు పై అధికారులకి తెలీదని అతని అభిప్రాయం. కొంత మేరకు అదీ కరక్టే!

పాపారావు యెంత గుంభనంగా వున్నా, అతని ఆఫీసు మాత్రం యెప్పుడూ కళకళ లాడుతూ వుంటుంది. అక్కడ పన్జేసే చాలామంది ఉత్సాహంగా, ఆనందంగా వుంటారు. బంట్రోతుతో సహా.

బంట్రోతు బసవయ్య కూడా యీ మధ్య ఓ చిన్న యిల్లు కట్టించు కున్నాట్ట. బంట్రోతేవిటి, యిల్లు కట్టించుకోవడమేమిటి అని మీ రాశ్చర్యపోకండి. అతనికున్న అవకాశాలతనివి.

ఆ ఆఫీసు గోడలు కూడా డబ్బులు అడుగుతాయంటారు. అది ఎంతవరకు నిజమో చెప్పలేంకానీ, అక్కడ పన్జేస్తున్న వ్యక్తుల ఆస్తి వివరాలు తెలుసుకుంటే కొన్నింటిలో నిజం బైట పడొచ్చు.

అలాగని అందరూ లంచాలు తీసుకునే వాళ్ళే ఉంటారా అంటే కాస్త ఆలోచించాల్సి వస్తుంది. ప్రతి విషయంలోను కొన్ని మినహాయింపులు వున్నట్లే ఈ ఆఫీసులోను కొందరు లంచాలకు దూరంగా ఉన్నవాళ్ళు ఉన్నారు.

అటువంటి వారిలో పరాంకుశం ఒకడు. అతను ముక్కుకు సూటిగా పోయే మనిషి. నీతి నిజాయితి ఉన్నవాడు. మితభాషి, అందరితోనూ స్నేహపూరితంగా ఉంటాడు. ఉండాలని

ప్రయత్నిస్తాడు. అయితే చాలామంది సహోద్యోగులు అతన్ని తెలివి తక్కువాడంటారు, ఉన్న అవకాశాన్ని వినియోగించుకోవడంలేదని; నిజానికి, పరాంకుశం పట్ల అభిమానం ఉట్టిపడి అలా అనడంలేదు. అతను బాగుపడిపోవాలనీ కాదు. మరెందుకయ్యా అంటే తాము కూరుకుపోయిన వూబిలో అతనెందుకు కూరుకుపోలేదన్న దుగ్ధను, అసూయతోను అతను మంచి పేరు తెచ్చుకోవడం వాళ్ళకు ఇష్టంలేదు మరి.

అయితేనేం పరాంకుశం అవన్నీ పట్టించుకోడు. సన్నగా నవ్వేసి ఊరుకుంటాడు. తప్పు చేస్తున్నవాడు తన తప్పు త్రోవలోకి అందర్నీ లాగలని ప్రయత్నిస్తాడన్న నిజం అతనికి తెలుసు.

✪ ✪ ✪

చీఫ్ ఇంజనీరు పాపారావుకి "అపరరావణుడ"న్న బిరుదు, అతని స్టాఫే అనధికారికంగా ఇచ్చారు. అందుకే ఆఫీసులో అతని చాంబరుకి వెళ్ళడానికి అందరికీ భయమే. ఆయన కబురంపితే కానీ, ఎవరూ వెళ్ళేవారు కాదు. ఒక వేళ ఏదో అర్జంటు కేసు ఉందని ఎవరైనా అతని చాంబర్‌కి వెళ్ళినా ఆయన మొహం ఛీదరించుకుని కనుబొమలు ముడుచుకునేవాడు.

"అది అర్జంటు కేసని నాకు తెలీదా? ఆ భాద్యత నాకు లేదనా? నాకంటే బాధ్యత గలవాడివా నువ్వు? ఎందుకయ్యా, కాకా పట్టాలని ప్రయత్నం చేస్తావు? ఐ హేటిట్ ..." అంటూ గట్టిగానే చివాట్లు పెడతాడు.

అందుకే వెళ్ళరెవ్వరూ, అలా మందలింపబడ్డవాళ్ళు మళ్ళీ నోరెత్తితే ఒట్టు అవి దీవెనల్లా భావించి, తెలిగ్గా నవ్వేస్తూ ఉంటారు. వాళ్ళకి ఆత్మభిమానమన్నది లెదోయేమో అసలు స్పందించరు. ఉద్యోగరీత్యా అతను ఆఫీసరేగాని, తమ జీవితాల్ని శాసించే అధికారం తమను అగౌరపరిచే అధికారం, ఆయనకు లేదన్న యెదిరింపు భావన వాళ్ళకెవరికీ లేదు. వాళ్ళు కుక్కిన పేలు. బిస్కెట్ల కోసం ఆశపడే పెంపుడు కుక్కలు. వాళ్ళకి కావల్సింది, చీఫ్ ఇంజనీరుగారి ప్రాపకం ఆయన తిట్లూ, చీవాట్లూ, చీదరింపులూ వాళ్ళకి ఆశీస్సులే!

అయితే అటువంటి వారికి భిన్నమైన మనస్తత్వం గలవాడు పరాంకుశం. పాపారావుచేత చీవాట్లు తినడం, అతనికీ అలవాటు లేదు. అంత వరకూ పరిస్థితి పెంచుకోడు. వేళకి, ఆఫీసుకి వెళ్తాడు. వేళకి ఆఫీసు విడిచిపెడతాడు. తన ఉద్యోగ నిర్వహణలో జాగ్రత్తగా వుంటాడు. అతని టేబిలు మీద, పెండింగు కేసులేం వుండవు. అక్రమార్జన చేసే అలవాటు లేదు గనక యెవర్నీ నొప్పించడు, తిప్పించడు.

పరాంకుశంకి అక్షరాలా సహధర్మచారిణి అతని భార్య వందన. అక్రమార్జన విషయంలో

సాధారణంగా ఆడవాళ్ళకి ఆమోదమే వుంటుంది గాని వందనకి మాత్రం అందుకు భిన్నంగా యేహ్య భావం వుంది. ఒకర్ని నొప్పించి మానసికంగా బాధించి అతని పరిస్థితుల్ని ఆసరాగా తీసుకుని లంచం తీసుకోవడం పాపమని ఆమె అభిప్రాయం. లంచాలు తీసుకుని భోగాలతో విలాసవంతమైన జీవితాల్ని గడుపుతున్న వారిని చూసి ఆమె యెప్పుడూ కృత్రిమంగానే వుంటుందంటుంది. అప్పుడప్పుడూ తన అభిప్రావయాల్ని భర్తతో వెల్లడిస్తుంటుంది. కూడాను.

"మీతో పన్జేస్తున్న కొందరు స్నేహితులు లంచాలు తీసుకుని విలాస వంతమైన జీవితం గడుపుతూ ఆ జీవితమే బావుందని, యెలా మురిసిపోతూ వుంటారండీ? అటువంటి జీవితం పట్ల వాళ్ళకి జుగుప్స కలగదూ?" అందోరోజు వందన.

పరాంకుశం మెల్లగా మందహాసం చేశాడు. భార్యకి అటువంటి సదుద్దేశం కలిగినందుకు మురిసిపోయాడు.

"లోకోఃభిన్నరుచిః అన్నారు. అలా జీవించడం లోనే వాళ్ళకి ఆనందమనిపిస్తుంది. దానికి మనమేంజేస్తాం వందనా?"

"ఇటువంటి వారి అక్రమ సంపాదనని అరికట్టే వాళ్ళుండరా అండీ?" బేలగా ప్రశ్నించింది.

పరాంకుశం మళ్ళీ అదేవిధంగా మందహాసం చేశాడు. వందన, ప్రపంచాన్నింకా క్షుణ్ణంగా చదవలేదనిపించింది.

"వున్నారు వందనా! కానీ వాళ్ళూ అదే కోవకి చెందిన వాళ్ళయ్యుంటారు. అంచేతనే లంచగొండి తనం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగిపోతోంది. మనలాంటి యే కొద్దిమందో వుంటే ప్రయోజనం ఓ విధమైన ఆత్మ తృప్తి వుంది..."

"పోనీలెండి. ఆ తృప్తి చాలు. నిశ్చింతగా నిద్రపోగలుగుతున్నాం అంతకంటే కావల్సిందేముందండీ" అంది సంతృప్తిగా.

పరాంకుశం లోలోన యెంతగానో ఆనందించాడు. తనకి వందనలాంటి అర్ధాంగి దొరకడం అదృష్టమే ననుకున్నాడు. "అది నిజం వందనా" అనేసి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

✪ ✪ ✪

ఆ రోజు పాపారావు విసురుగానే ఛాంబర్‌లోకి వచ్చాడు. అతని మొహం కందగడ్డలా వుంది. ఎవరయినా చిన్న పిల్లలు చూస్తే జడుసుకునేంతటి వికృతంగా వుందా మొహం.

ద్వారం దగ్గర నిలబడి సలాం కొట్టిన బంట్రోతు బసవయ్య, బాస్ మొహం చూసి ఆశ్చర్యపోలేదు. ఏదో విశేషం వుండి వుంటుందనుకున్నాడు.

పాపారావు కుర్చీలో కూచుంటూనే బెల్ కొట్టాడు. బసవయ్య దానికోసమే యెదురు చూస్తున్నట్టుగా సర్రున లోపలికొచ్చి సవినయంగా రెండు చేతులూ కట్టుకుని నిల్చున్నాడు.

"పరాంకుశంని రమ్మను..." గంభీరంగా అన్నాడు పాపారావు.

బసవయ్యకి, అయ్యగారి మొహం చూసినప్పుడే అనిపించింది యివ్వాళ రోజు బాగుండదని, పాపం పరాంకుశం దురదృష్టవంతుడనుకున్నాడు.

"చిత్తం..." అంటూ వెనక్కి తిరిగి వెళ్ళి పోయాడు.

పరాంకుశం తల వంచుకుని పన్జేసుకుంటున్నాడు.

"పరాంకుశం గారూ..." పిల్చాడు, బసవయ్యా.

"ఏమిటి బసవయ్యా?" పరాంకుశం తలెత్తాడు.

"అయ్యగారు, తమర్ని రమ్మన్నారండీ..."

"సరే... పద..."

బసవయ్య వెళ్ళిపోయాడు. పరాంకుశం లేచాడు.

ఆ సెక్షన్లో వున్నవాళ్ళ దృష్టి పరాంకుశం మీదే కేంద్రీకరించింది. "అయ్యగారు, యెప్పుడూ యెవర్నీ పిలవరు. పిల్చారూ అంటే చీవాట్లు తప్పవు... అని యెవరి మనసులో వారే అనుకున్నారు. కానీ, పరాంకుశం మాత్రం అలా అనుకోకుండానే చీఫ్ ఇంజనీరు గదికేసి నడిచాడు. అతనికి యెటువంటి భయమూ లేదు. లోపల అడుగుపెడుతూనే "గుడ్ మార్నింగ్ సార్..." అన్నాడు.

పరాంకుశం కేసి తీక్షణంగా చూశాడు పాపారావు. ఆఫీసరు చూపుకి అదిరిపోలేదు పరాంకుశం.

"నిన్నను నేనిచ్చిన ఆ టెండరు కేసుని పుటప్ చెయ్యమని చెప్పాను. కదా, యింకా చెయ్యలేదేం పరాంకుశం?" కోపంగా ప్రశ్నించాడు పాపారావు.

"నిన్ననే నోటు రాసి మీకు పంపించానండీ. మీ దగ్గరే వుండి వుంటుంది" మామూలుగానే సమాధానం చెప్పాడు పరాంకుశం.

"స్వయంగా తీసుకొచ్చి నాకు యివ్వచ్చును కదా! ఈ మహా సముద్రంలో దాన్ని యెక్కడ వెదుకుతాం చెప్పు. ఆపాటి ఇంగితం లేకపోతే యెట్లాగోయ్" మొహం చీదరించుకుంటూ అన్నాడు.

"ఇంగితం లేకపోవడం కాదండీ... మీరు పిలిస్తేనే తప్పించి మీ ఛాంబర్‌కి యెవ్వరూ రాకూడదని ఆర్డరు వేసింది మీరే కదా! అలా వచ్చి మీ కోపానికి గురైన వాళ్ళున్నారు. అకారణంగా ఆ పరిస్థితిని తెచ్చుకోవడం యిష్టం లేక రాలేదండీ!" తొణక్కుండా అన్నాడు పరాంకుశం.

పాపారావు కొద్దిగా వెనక్కి తగ్గాడు. నిజమే. ఆయన వేసిన ఆర్డరు అదే. దాన్ని వుల్లంఘించడం, వాళ్ళ తరం కాదు. 'తానంటే యెంత భయం వాళ్ళకి'... అనుకుని, తన స్ట్రిక్ట్‌నెస్‌కి లోలోన పొంగిపోయాడు. అయితే ప్రస్తుతం కావల్సిన ఫైలు అవసరం యెంతో వుంది. దానివల్ల అభివృద్ధిపొందేది తనే... గత రాత్రి తాను పాల్గొన్న పార్టీ గుర్తుకొచ్చింది పాపారావుకి.

''తెలివిగా మాట్లాడుతున్నానని అనుకుంటున్నావా యేమిటోయ్'' తనని తను సమర్థించుకుందుకు అలా అన్నాడు పాపారావు.

"ఇందులో తెలివి తేటల ప్రసక్తి యెందుకండి వున్న విషయమే చెప్పాను."

పాపారావు విసుక్కున్నాడు. మిగతా వాళ్ళలా పరాంకుశం తనని చూసి భయపడకపోవడం అతనికి కోపం తెప్పించింది.

"అధిక ప్రసంగం చేయకు. ఆ ఫైలు ఎక్కడుందో తీసివ్వు... " కటువుగా అన్నాడు.

పరాంకుశంకు తప్పలేదు. ఎందుకంటే, పాపారావు ఆ ఫైలు వెతుక్కోవడమంటే జరగనిపని. అందుకని చీఫ్ ఇంజనీరు పక్కనే ఉన్న

"రాక్' దగ్గరకు వెళ్ళి దొంతర్లగా ఉన్న ఫైళ్ళ నుంచి అతనికి కావాల్సిన ఫైలు తీసి అతని ముందుంచాడు.

పాపారావు ఫైలుమీద ఉన్న నోటు చదివాడు. క్లుప్తంగా చాలా బాగుంది. పరాంకుశం వర్కింగ్ ఎబిలిటీని మనసులోనే మెచ్చుకున్నాడు. కాని అతనో 'కొరకరాని కొయ్య' కావడం పాపారావుకు నచ్చని విషయం. అందుకే బాహ్యంగా అతన్ని మెచ్చుకోలేదు.

ఆ నోటు మీద తన ఆర్డర్స్ వేసేసి పరాంకుశంకు ఆ ఫైలు ఇచ్చేసాడు పాపారావు.

" ఆఫీసు ఆర్డర్ వెంటనే తయారు చేసి టైపు చేయించి నా సంతకం తీసుకొని యీ రోజే డిస్పాచ్ చేయలోయ్" అన్నాడు పాపారావు.

పరాంకుశం ఆ ఫైల్ని తీసుకోలేదు.

" అది నావల్ల కాదు సార్. మీరు చెప్పినట్లుగానే ఆఫీసార్డర్ రాసేసి ఇవ్వాళే టైపు సెక్షన్‌కు పంపుతాను. టైప్ సెక్షన్‌లో వాళ్ళకు రిక్వెస్ట్ చేయించి టైప్ చేయించడం నాకు సంబంధించినది కాదు. అంత అర్జంటయితే మీ స్టెనో గ్రాఫర్‌కిచ్చి ఆ పని చేయించుకోండి." నిర్మొహమాటంగా, నిష్కర్షగా, నిర్భయంగా చెప్పేశాడు పరాంకుశం.

క్షణం పాటు చైతన్యరహితుడయ్యాడు చీఫ్ ఇంజనీర్ పాపారావు. అతని అహం దెబ్బతింది.

ఇంతవరకు తనని ఎవ్వరూ ఇలా ఎదిరించి మాట్లాడలేదు. అట్లాంటిది ఈ పరాంకుశం పొగరేవిటి ? తనని తాను ఏమనుకుంటున్నాడో ... ? అనుకొని కళ్ళెర్ర చేశాడు. అతని మొహం వికృతంగా మారింది.

"ఏమిటి ? నువ్వు, నాకు ఆర్డర్ వేస్తున్నావా ? ఎంత పొగరు నీకు ?"

పళ్ళు పటాపటా కొరికాడు పాపారావు.

స్వతహాగా, పరాంకుశం సహనపరుడే , కాని పాపారావు మాటలు అతనిలోని సహనాన్ని రెచ్చగొట్టినాయి. సహనం కోల్పోయాడు.

" సార్ ! మీరు నాకు అధికారే కావొచ్చు. మీకూ ఓ హద్దంటూ వుంది కదా ! నా ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టే విధంగా మీరు మాట్లాడకూడదు. అది మీకు శ్రేయస్కరం కాదు.. " అన్నాడు పరాంకుశం.

నిరంకుశ ధోరణిలో యింతవరకూ మసలు కొచ్చిన పాపారావుకి పరాంకుశం మాటలు హెచ్చరికలా తోచినయ్. మరీ మండిపోయాడు. .

" ఏవిటి నన్ను హెచ్చరిస్తున్నావా ? " విసురుగా అన్నాడు

" మీరు యెలా అర్థం చేసుకున్నా ఫరవాలేదు. నా పరిధిలో నా ఉద్యోగ నిర్వహణ చెయ్యడం నా కర్తవ్యం. అంతేగాని టైపు సెక్షనుకి వెళ్ళి దాన్ని టైపు చేయించుకు రావడం నా వల్ల కాదన్నాను. అక్కడికి వెళ్తే ; వాళ్ళేమంటారో తెలుసా సార్ ? నాకేదో యిందులో స్వార్థం వుందంటారు. నేనెందుకా అభాండాన్ని నా నెత్తిన వేసుకోవాలి చెప్పండి ? అందుకే మీ స్టెనోకిచ్చి చేయించుకో మన్నాను. దాన్ని మీరు పొగరుగా చిత్రీకరిస్తే యెలా ?"

పాపారావు మరింత రెచ్చిపోయాడు. అన్యాపదేశంగా తనకీ కేసులో యింట రెస్ట్ వుందనే భావం వచ్చేలా పరాంకుశం మాట్లాడుతున్నట్టనిపించింది.

" అంటే .. ? నాకీ కేసులో యేదో స్వార్థం, ఇంటరెస్ట్ వుందనేగా నీ వుద్దేశం ?" కటువుగానే అన్నాడు.

పరాంకుశం జంకలేదు.

" అలాగని నేను అనలేదండి ! మీకు యింటరెస్టు వుందో, లేదో, ఆ భగవంతుడికే తెలియాలి... యింకా యేమేమో అనేయాలనుకున్నాడు గాని తమాయించుకున్నాడు.

పాపారావు, దెబ్బదిన్న పులిలా పరాంకుశం కేసి యెర్రగా చూశాడు.

" అసలు .. అసలు.. నిన్నా సెక్షనులో వుంచడమే తప్పయ్యింది' అన్నాడు కసిగా.

పరాంకుశం చెక్కుచెదరలేదు. చిన్నగా నవ్వేడు.

"అది మీ తప్పుకాదు సార్ ! చాలా రోజుల్నించి నేనా సెక్షనులో వున్నాను. మీరంటే మొన్నమొన్న వొచ్చారు. ఆ సెక్షనులో నేనుండటం, మీకు బాధాకరమైతే, మరో సెక్షనుకి మార్చేయొచ్చు. ఆ సెక్షనులో నాకేం యింటరెస్టు లేదు. అదే కాదు... అన్ని సెక్షన్లూ నాకొకటే. ఫలానా సెక్షను కావాలంటూ కోరే వ్యక్తిని కాదు. నాకేం ఆశల్లేవు. అక్రమార్జన చేయ్యాలన్న తలంపు లేదు. మేడలు కట్టించేయాలన్న తాపత్రయం లేదు. విలాసవంతమైన జీవితం గడపాలన్న కోరికా లేదు. నాకు కావాల్సింది న్యాయం... నీతి... నిజాయితీ సార్...' గుక్క తిప్పకుండా చెప్పకుపోయాడు పరాంకుశం.

అప్పటికే కొందరు చాంబరు బైట స్ప్రింగ్ డోర్సు వెనుక తచ్చాడుతున్నట్లు చూశాడు పాపారావు. అతను అనుకోకుండా భుజాల తడుముకున్నాడు. తాను శ్రీకాకుళంలో యిల్లు కట్టించిన వైనం పరాంకుశంకి తెలుసునేమోనన్న భయం అతణ్ణి ఆవరించింది. ఇంకా అతనితో వాగ్వివాదం పెంచుకుంటే యింకేవేవో విషయాలు సంభాషణల్లోకి వచ్చేయొచ్చు.... పెంచుకోకూడదు. ప్రస్తుత కేసులో నష్టపోయినా, పరాంకుశంతో వివాదం తనకే శ్రేయోదాయకం కాదనిపించింది. కోపాన్ని దిగ్గమింగుకున్నాడు పాపారావు. బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

"సరే ! ఇక నువ్వు వెళ్ళొచ్చు పరాంకుశం.: " అన్నాడు మెల్లగా.

బాస్ ఒక్కసారి మంచు ముక్కలా చల్లబడ్డం పరాంకుశంకి అర్థం కాలేదు. ఆ విషయం తనకి అనవసరమనుకుని వెనక్కి తిరిగాడు.

"ఆ ఫైలు తీసుకెళ్ళవోయ్..' అన్నాడు పాపారావు. అతని గొంతులో అధికారం ధ్వనించలేదు.

'మరి, ఈ రోజు డిస్పాచ్ అవ్వదు సార్...' అన్నాడు పాపారావు.

నిజాయితీ పరులంటే అవినీతిపరులకు సింహస్వప్నంగా వుండటం సహజమే మరి. పాపారావు కళ్ళకి సింహంలా అగుపించాడు పరాంకుశం. ఇన్నాళ్ళకి తన అహాన్ని దెబ్బకొట్టాడీ వ్యక్తి... అనుకున్నాడు పాపారావు.

ఫైలు పట్టుకుని సింహంలా ఛాతి విరుచుకుంటూ చీఫ్ ఇంజనీరు ఛాంబరు లోంచి బైటకొస్తున్న పరాంకుశంని చూసి సహోద్యోగులు మొహాలు దించుకున్నారు. ఆ ధైర్యం తమకేదీ ? అనుకున్నారు యెవరి మనసులో వారే.

□□□

(ఆంధ్రజ్యోతి తేదీ- 4.1.91)